VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 104
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 29 ఆగష్టు 2025

# ఉల్లి రైతుల నుంచి క్వింటాకు రూ.1200 చెల్లించి కొనుగోలు

● ఉల్లి రైతులు నష్ట పోకూడదు...కష్ట పడకూడదు ● కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లకు తరలించండి ● ఉల్లి రైతుల ఇబ్బందులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచే క్వింటాకు రూ.1200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లపై గురువారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా.. మహారాష్ట్ర ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లల్లో అద్దెకు తీసుకుని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు.. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు..** రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ట్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 2-3 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఈ చర్యలు ఉపకరిస్తాయి." అని సీఎం అన్నారు.

# క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదిక కావాలి...

● క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు కృషి... ● తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ● క్రీడా పోటీలు, సబ్ కమిటీల ఏర్పాటుపై తీర్మానాలు...



File Photo

**హైదరాబాద్,కలంకౌంటర్ :** ఖేలో ఇండియా, కామన్ వెల్త్, ఒలింపిక్స్ ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తెలంగాణకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు మొదటి సమావేశం హైదరాబాద్‌లో గురువారం జరిగింది. సమావేశంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహం విషయంలో ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికిగానూ గతంతో పోల్చితే 16 రెట్లు బడ్జెట్ పెంచామని సీఎం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. క్రీడా రంగం అభివృద్ధికి నిధులు, నిపుణులు, నిర్వహణ అవసరమైనందునే బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని సీఎం తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని... ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. ధాని ఫౌండేషన్ వీతా ధానీ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని... వ్యాయామ అక్షరాస్యత (Physical literacy)పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు...బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని.. అప్పుడు మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు...హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. అలాగే స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. హబ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం నుంచే ఉన్నందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు...క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని...అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. శాసనసభ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు.. క్రీడా సామగ్రిపై ఉన్న పన్నుల తగ్గింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని... తమ స్థాయిలో అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు తెలియజేశారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రానున్న మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. సమావేశంలో క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోని బాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సరఫరాపై రాష్ట్ర రైతాంగానికి శుభవార్త తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు

● 10,350 మెట్రిక్ టన్నుల యూరియా నేడు గంగవరం పోర్టులో దిగుమతి ● సమాచార లేఖను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిన కేంద్ర ప్రభుత్వ ఎరువుల రసాయనిక మంత్రిత్వశాఖ. ● యూరియా సరఫరాపై కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ● పంటల అవసరాల దృష్ట్యా జిల్లాలకు యుద్ధప్రాతిపదికన పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ డిల్లీ రావుకు తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోక శుభవార్త తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో మాట్లాడటంతో నేడు రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టునకు చేరుకుంటున్నదని మంత్రి అచ్చెన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు సత్వరమే సానుకూలంగా స్పందించి రాబోయే సెప్టెంబర్ నెల 6 వ తేదీనాడు రావలసిన యూరియా సరుకును వారం ముందుగానే రాష్ట్రానికి సరఫరా చేసినందుకు కేంద్రానికి మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని అన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ( ఐ పి యల్) కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు . రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగు పరిస్థితి, వాటి దశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ,ప్రణాళిక బద్దంగా అత్యంత అవసరం ఉన్న ప్రాంతాలకు, తక్షణ పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ,వ్యవసాయ అధికారుల పూర్తి పర్యవేక్షణలో రైతులకు యూరియా ను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ డిల్లీ రావుకు మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్ నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్ కు సుమారు మరొక 25000 మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు . రైతులు యూరియా సరఫరా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్ కి యూరియా పుష్కలంగా లభిస్తుందని హామీ ఇచ్చారు . రైతులు వారి పంట తక్షణ అవసరాలకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, వచ్చే రబీ సీజన్ కు ముందస్తు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రైతులను మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువులను ఇతర రాష్ట్రాలకు , పక్కదారి మళ్ళకుండా,అధిక ధరలకు అమ్మకుండా , నిఘా ఎన్ఫోర్స్మెంట్ ను మరింత కట్టుదిట్టం చేసి ,కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు . ప్రతి జిల్లాలో కలెక్టర్ , ఎస్పీల ఆధ్వర్యంలో వ్యవసాయ , పోలీసు ,విజిలెన్స్ ,రెవెన్యూ ,పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్ లను ఏర్పరిచి తనిఖీలను చేస్తున్నామని తెలిపారు

# హోంగార్డుల స్వరాష్ట్రాల బదిలీ సమస్యను పరిష్కరించండి


● యూరియాతో పాటు ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచండి ● ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గురువారం సచివాలయంలో కలిశారు. వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో హోంగార్డులుగా నియామకం పొందిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో ఏపీ స్థానికత, ఏపీలో తెలంగాణ స్థానికత కలిగిన హోం గార్డులు పనిచేస్తున్నారని సీఎంకు వివరించారు. వీరు ఇంకా వారి స్వరాష్ట్రాలకు బదిలీ కాకపోవడంతో చాలా అవకాశాలు కొల్పోతున్నారని రామకృష్ణ చెప్పారు. కానిస్టేబుల్స్ సెలెక్షన్స్ విషయంలో వీరికి రెండు రాష్ట్రాల్లోనూ సాంకేతిక సమస్యలు ఎదురువుతున్నాయని చెప్పారు. వీరిని వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేయించేలా చొరవ తీసుకోవాలని సీఎంను కోరారు. ఇక రాష్ట్రంలో యూరియాతోపాటు.. రైతులకు అవసరమైన ఎరువులనూ అందుబాటులోకి తీసుకురావాలని వినతి సీఎంకు వినతి పత్రం సమర్పించారు. సీఎంను కలిసిన వారిలో ఆ పార్టీ నేత ముప్పాళ్ళ నాగేశ్వరరావు ఉన్నారు.

# తిరుమల శ్రీవారి సేవలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్,మంత్రి నారాయణ

● భారతదేశం శక్తివంతంగా ఎదగాలి: ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ ● కంచిమఠాన్ని సందర్శించిన రాధాకృష్ణన్,నారాయణ ● శేష వస్త్రంతో సత్కరించిన తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్





**తిరుమల,కలంకౌంటర్ :** ప్రపంచ దేశాలలో భారత్ శక్తివంతమైన దేశంగా ఎదగాలని తిరుమల శ్రీవారిని ప్రార్థించినట్లు ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ తెలిపారు. తిరుమల శ్రీవారి నైవేద్య విరామ సమయంలో ఇండియా ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ తో పాటు..మంత్రి నారాయణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.. ఆధ్యాత్మికత ఒక్కటే ఉన్నతమైన మానవ జీవన విధానమని, ఆధ్యాత్మికం వలన స్వీయ నియంత్రణ, క్రమశిక్షణ సిద్ధిస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు.స్వామి అనుగ్రహంతో దేశప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు..తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుపతిలోని కంచి మఠాన్ని సందర్శించారు. ఆయన వెంట మంత్రి నారాయణ, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఉన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహం పొంది ఆశీస్సులను అందుకున్నారు.తిరుమల, తిరుపతి పర్యటన అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి మహారాష్ట్ర గవర్నర్ సీపీ. రాధాకృష్ణన్ తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయనకు మంత్రి పి.నారాయణ, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ వీడ్కోలు పలికారు. బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు. బీజేపీ నాయకులు, తుడా ఛైర్మెన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ,టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఉన్నారు.



# విద్యుత్ అదనపు భారాలను తగ్గించాలి... మాజేటి డిమాండ్




**బంటుమిల్లి ,కలంకౌంటర్ :** వినియోగదారులపై ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు అదనపులోడు పేరుతో విద్యుత్ అదనపు భారాల వసూలు నిలిపివేయాలని సిపిఎం పార్టీ బంటుమిల్లి మండల కార్యదర్శి, మాజేటి శివ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం బంటుమిల్లి అంబేద్కర్ సెంటర్ లో గురువారం, బషీరాబాగ్ విద్యుత్ ఉద్యమ అమరుల జ్ఞాపకార్థం ప్రతిజ్ఞ దినోత్సవం నిర్వహించారు. వామపక్షాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజేటి శివ శ్రీనివాసరావు, మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను బిగించడం ద్వారా విద్యుత్ సంస్థలు కార్పొరేట్ సంస్థలకు లాభం చేస్తూ అదే సమయంలో సామాన్యుల పై అదనపు భారాలు వేస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ను ప్రభుత్వం పూర్తిగా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2000 సంవత్సరం ఆగస్టు 28వ తేదీన బషీర్బాగ్ కాల్పుల్లో మరణించిన ఉద్యమ పోరాట యోధులు ను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజేటి పిలుపునిచ్చారు. పేద ప్రజల ను దోపిడికి గురి చేస్తున్న ప్రభుత్వ విధానాలను వామపక్షాలు ఐక్యమంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఎం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, మాట్లాడుతూ విద్యుత్తు పంపిణీ, నిర్వహణ వ్యవస్థలను ప్రభుత్వం ప్రవేట్ సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాల వల్ల వేలాదిమంది ఉద్యోగులు రోడ్డున పడుతున్నారన్నారు. . సిపిఎం మండల కమిటీ, నాయకులు లంక దాసుల అజయ్ ఘోష్, మాట్లాడుతూ ప్రభుత్వాలు స్మార్ట్ గా విద్యుత్ వినియోగదారులను దోచుకోవడానికి పరోక్షంగా చార్జీలు పెంచుతున్నాయని విద్యుత్ ఛార్జీల పెంపు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అమరులైన కమ్యూనిస్టు కార్యకర్తల త్యాగాలు ప్రజా ఉద్యమాలకు ఊపిరి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ బంటుమిల్లి మండల కమిటీ సభ్యులు పొదిలి వెంకన్న నాగిశెట్టి కృష్ణ వెంట్రుపాటి శ్యాముందర్ నాగిశెట్టి చంద్రశేఖర్ చొప్ప బాజీ తదితరులు పాల్గొన్నారు. మండలంలో అమరవీరుల సంస్కరణ సభలు పెందూరు, బంటుమిల్లి, ఆమదాలపల్లి, ముల్లపర్రు, జైపురం పెద్ద తుమ్మిడి గ్రామాలలో జరిగాయి.

# గవర్నమెంట్ హైస్కూల్ ఉపాధ్యాయుడి ఘన సన్మానం



**తిరువూరు,కలంకౌంటర్ :** ఎన్ టి ఆర్ జిల్లా తిరువూరు గవర్నమెంట్ హైస్కూల్లో ఉపాధ్యాయులు గా సేవలందించి ఇటీవల కాలంలో పదవీ విరమణ పొందిన నల్లగుండ్ల రామకృష్ణారెడ్డి కి హైస్కూల్ ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు ఘన సన్మానం నిర్వహించారు , ఈ సంధర్భంగా సన్మానానికి ముఖ్య అతిధి గా పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి , డిప్యూటీ ఎడ్యుకేషనల్ అదికారి యైన ఎ. శ్యామ్ సుందరరావు మాట్లాడుతూ ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర లలో ఉపాధ్యాయులు గా పనిచేస్తూ ఎంతో మందిని ఉన్నత శిఖరాగ్రాన నిలిపిన ఘనత మన రామకృష్ణారెడ్డి అని కొనియాడారు అనతి కాలంలోనే పదవీ విరమణ చేయటం విద్యామ తల్లికి ఎంతో లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు ఇంకా ఇలాంటి వారు విధ్యలయాల్లో ఉంటే వికాస విద్యావనాన్ని స్థాపించ వచ్చుని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ ఎం సి ఛైర్మన్ వెంపాటి అబ్రాహామ్ మణిరత్నం వైస్ ఛైర్ పర్సన్ పగిడాల సీత పాఠశాల ఉపాధ్యాయనీ ఉపాధ్యాయుల లు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల్లో ప్రాణాలతో బయటపడేందుకు హెల్మెట్ ధారణ తప్పనిసరి

**-జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**



**విజయనగరం,కలంకౌంటర్ :** రహదారి భద్రత, ప్రమాదాల నియంత్రణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్, హైవేలపై, ముఖ్య కూడళ్ళు వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టి "హెల్మెట్ ధారణ" పై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్స్ ధరించని వాహనదారులపై కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ రహదారి భద్రతకు జిల్లా వ్యాప్తంగా ఆగష్టు 18 నుండి 24 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, రహదారి భద్రతకు హెల్మెట్స్ ధరించని ద్విచక్ర వాహనదారులపై 452 కేసులు నమోదు చేసి, ఈ-చలానాగా రూ. 4,75,725/-లను విధించామన్నారు. స్పెషల్ డ్రైవ్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలోని బ్లాక్ స్పాట్స్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ద్విచక్ర వాహనదారులకు రోడ్ సేఫ్టీ నిబంధనల గురించి మరియు హెల్మెట్ ధరించకుండా వాహనం నడపడం వలన కలిగే అనర్ధాలను సంబంధిత అధికార్లు వివరిస్తూ, కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని, తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్స్ ధరించాలన్నారు. వాహనదారుడుతోపాటు ద్విచక్ర వాహనంకు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతీ వాహనదారుడు భద్రత ప్రమాణాలను పాటిస్తూ, సురక్షితంగా గమ్య స్థానాలు చేరుకోవాలన్నారు. రహదారి భద్రత నియమాలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వాహనదారులను జిల్లా ఎస్పీ హెచ్చరించారు. హెల్మెట్ ధరించడం వలన ఏదైనా ప్రమాదం జరిగినా తలకు తీవ్ర గాయం కాకుండా ఉంటుందని, ప్రాణాపాయం నుంచి బయటపడ వచ్చునన్న వాస్తవాన్ని ప్రతి ద్విచక్ర వాహనదారుడు గుర్తించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు. ఈ ప్రత్యేక డ్రైవ్ ను విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యా రెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారన్నారు.

# అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించం

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ● పెన్షన్లపై వైసీపీది అనవసర రాద్ధాంతం ● పార్టీని బతికించుకోడానికి వైసీపీ నాయకులు అబద్ధాలు ప్రచారం ● పంచాయతీ కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు ● పెనుకొండలో టీడీపీ కార్యాలయ నిర్మాణం : మంత్రి సవిత ● పి.రొప్పాలలో రూ.2 కోట్లతో పీహెచ్సీ భవన నిర్మాణం ● భూమి పూజ చేసిన మంత్రి... ● ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు కూడా భూమి పూజ





**పెనుకొండ/శ్రీసత్యసాయి ,కలంకౌంటర్ :** అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తున్నారంటూ వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. పెనుకొండ నియోజక వర్గంలోని రొద్దం మండలం పెదమంతూరు పంచాయతీ పి.రొప్పాల గ్రామంలో రూ. 2 కోట్లతో పీహెచ్సీ భవన నిర్మాణానికి మంత్రి సవిత భూమి పూజ చేశారు. అనంతరం అదే గ్రామంలో అన్న ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కూడా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందేలా పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామన్నారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మంటపాలకు ఉచిత విద్యుత్ కూడా అందజేస్తున్నామన్నారు. ప్రజాభీష్టం మేరకు సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మంత్రి సవిత కొనియాడారు.

**అర్హుల పెన్షన్లు తొలగించడం లేదు...** అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు తొలగించడంలేదని మంత్రి సవిత తెలిపారు. వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని, పార్టీని బతికించుకోడానికి ఆ పార్టీ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కూడా అందజేయనున్నామని, ఇప్పటికే రేషన్ కార్డులు అందజేశామని మంత్రి సవిత తెలిపారు.

**ప్రతి పంచాయతీలోనూ ఎన్టీఆర్ విగ్రహం..** నియోజక వర్గంలో ఉన్న ప్రతి పంచాయతీ కేంద్రంలోనూ అన్న ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. దీనిలో భాగంగానే అన్న ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కూడా భూమి పూజ చేశామన్నారు. సోమందేపల్లిలో ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ చేతుల మీదుగా ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరించనున్నట్లు వెల్లడించారు. పెనుకొండలో ప్రస్తుతం తన సొంత నిధులతో అన్న క్యాంటీన్ ను నిర్వహిస్తున్నానని, త్వరలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. నియోజక వర్గ కేంద్రం పెనుకొండలో టీడీపీ కార్యాలయం నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

**త్వరలో కందుకూరు పల్లి నుంచి చెనుకొండపల్లి రహదారికి భూమి పూజ..** రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని, నియోజక వర్గంలోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి సవిత తెలిపారు. రొద్దం మండలంలో రూ. 25 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. రూ. 2 కోట్లతో పీ హెచ్సీ భవనాన్ని నిర్మించబోతున్నామన్నారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నామని, రెండు తాగునీటి బోర్లు కూడా మంజూరు చేశామని వెల్లడించారు. మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్, అదనంగా మరో బీసీ హాస్టల్ ను కూడా నిర్మించబోతున్నట్లు తెలిపారు. త్వరలో కందుకూరు పల్లి నుంచి చెనుకొండపల్లి రహదారి నిర్మించబోతున్నామన్నారు. ఇందుకు సంబంధించి భూమి పూజ కూడా త్వరలో చేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి మంత్రి సవితకు పి.రొప్పాల గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జల హారతి విజయవంతం చేయాలి - ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**-జల హారతిలో ప్రతి ఒక్కరు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**





**కుప్పం,కలంకౌంటర్:** నియోజకవర్గంలో హెచ్ ఎన్ ఎస్. ఎస్ కెనాల్ ద్వారా ఇరువైపుల స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు విరివిగా పాల్గొని జల హారతి కార్యక్రమాలను విజయవంతం చేయాలిఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కడ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీన ముఖ్యమంత్రి హంద్రీనీవా కాలువ ద్వారా పరమ సముద్రం చెరువునందుజలహారతికార్యక్రమాలలో పాల్గొంటారు, ఆ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సంబంధిత వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, స్పెషలాఫీసర్లు, మండల స్థాయి అధికారులు నాలుగు మండలాలలో హంద్రీనీవా కాలువ ప్రవశించే ప్రాంతాలలోరైతులనుజలహారతికార్యక్రమాలలో పాల్గొనే విధంగా ముందుస్తే ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోల, కడపిడి వికాస్ మరమత్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 30 తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో జల హారతి కార్యక్రమాలలో పాల్గొంటారు, వారి పర్యటన విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నాలుగు మండలాలలో సుమారు హెచ్ ఎన్ ఎస్ కెనాల్ 49 కిలోమీటర్ల ప్రయాణిస్తుందని ఆ కెనాల్ సమీపంలో సంబంధిత రైతులు జల హారతి కార్యక్రమాలలో పాల్గొనివిజయవంతంచేయాలని తెలిపారు, రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడిపల్లి మండలాలకు ప్రత్యేక స్పెషల్ అధికారులు ఏర్పాటు చేయడం జరిగిందని, వ్యవసాయ, ఉద్యానవన, ఏపీఎంఐపీ, జిఎం ఇండస్ట్రీ, జిల్లా అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు, కుప్పం నియోజకవర్గంలో భూగర్భ జలాలు తక్కువగా ఉన్నాయి ఇతర నియోజకవర్గాలలో పోలిస్తే కుప్పం నియోజకవర్గం చాలా తక్కువ శాతం ఉన్నదని తెలిపారు, జలహారతులు రైతులు విరివిగా పాల్గొని, నీటి విశిష్టతను గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి ఆలోచనతో ఈ కార్యక్రమంనిర్వహించుచు న్నామని తెలిపారు, అందుకు ప్రతి మండలంలో రైతు సేవ కేంద్రాలలో పనిచేసే సిబ్బంది, తెలుగు సిబ్బంది, నాలుగు మండలాలలో ఒక్కొక్క మండలంలో హంద్రీనీవా ప్రవహించే కాలవలు ద్వారా 25 పాయింట్లు గుర్తించి అక్కడ జల హారతి కార్యక్రమాలను విజయవంతం చేయడానికి మండల స్థాయి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈనెల 30వ తేదీన 10.30 ఉదయం నుండి 11.15 గంటల వరకు ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి పాల్గొంటారని, ఆ సమయంలో కెనాల్ ప్రవహించే ప్రాంతాలలో కెనాల్ కి ఇరువైపుల రైతులు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క స్థానిక ప్రజా ప్రతినిధులను ఆయా కార్యక్రమాలలో ఆహ్వానం పలకాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి లొకేషన్ నందు పోలీస్ సిబ్బంది నియమించడం జరిగిందని, జల హారతి కార్యక్రమాలలో, వృద్ధులను, పిల్లలను ఆహ్వానించకండి ఆదేశించారు, నీటి యొక్క విశిష్టతను గురించి భవిష్యత్తు తరాలకు తెలియజేయవలసిన బాధ్యత మన అందరి పై ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ, ఆర్టికల్చర్ డిడి మధుసూదన్ రెడ్డి, సెరికల్చర్ జెడి పద్మావతి, డిపిఓ, సుధాకర్ రావు, ఇండస్ట్రీ జిఎం సూరిబాబు, ఇతర శాఖల అధికారులు, నాలుగు మండలాల వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి

● సురక్షితమైన ప్రదేశాలలోనే నిమజ్జనాలు నిర్వహించాలి
● డీజే, అసభ్యకర నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదు ● జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో జరగబోయే వినాయక నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా, సురక్షితంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు తగిన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి ప్రజలకు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు గురువారం ముఖ్య సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. పొంగి పొర్లుతున్న నదులు, వాగులు, వంకల్లో నిమజ్జనానికి దూరంగా ఉండాలి ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భక్తులు వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకల్లో దిగరాదు. కల్వర్టులు, చప్టాలపై వరద నీరు పొంగి ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటే ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. ఇటువంటి నిర్లక్ష్యం వలన ప్రాణాలకు ముప్పు కలిగే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ, పోలీసులు సూచించిన సురక్షిత ప్రదేశాల్లోనే వినాయక నిమర్జనాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు.

**ఊరేగింపు సమయంలో పాటించవలసిన నియమాలు..** వినాయక నిమజ్జన ఊరేగింపులు శాంతియుతంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవాలి. ఇతర మతాలు, వర్గాలు, వ్యక్తులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు, నినాదాలు, చేయరాదు. ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదు. ఊరేగింపులో ఉపయోగించే వాహనాలు మంచి కండిషన్లో ఉండాలి. వాటి వివరాలను ముందుగానే సంబంధిత పోలీసులకు తెలపాలి. మద్యం సేవించిన వారు ఊరేగింపులో, నిమజ్జన కార్యక్రమాలలో పాల్గొనకుండా కమిటీ సభ్యులే చూసుకోవాలి. నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్స్ వినియోగించరాదు. అసభ్యకర వేషధారణలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదు. వృద్ధులు, చిన్నారులను నిమర్జన కార్యక్రమాలకు దూరంగా ఉంచాలి. ఊరేగింపు సమయంలో రంగులు చల్లడం, బాణాసంచా పేల్చడం వంటివి చేయరాదు. నిమజ్జన ప్రదేశంలో అధికారులు ఇచ్చే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి. వినాయక నిమజ్జనాలు సక్రమంగా, సురక్షితంగా జరిగేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని, ప్రజలు భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా ఉత్సవాలను నిర్వహించాలని, ఎటువంటి వివాదాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. నదులు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో అధికారులు సూచించిన ప్రదేశాలలోనే వినాయక విగ్రహాల నిమజ్జనాలు చేయాలన్నారు. పోలీసుల సూచనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉన్న, పోలీస్ శాఖ సహకారం అవసరమైన వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు లేదా టోల్ ఫ్రీ నెంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలని, ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు.

# ఏపీ క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం తీపికబురు

● రూ.4.9 కోట్ల క్రీడా ప్రోత్సాహకాలు విడుదల ● 43 మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి ● సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన శాప్ ఛైర్మన్ రవినాయుడు




**విజయవాడ,కలంకౌంటర్ :** గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ. 4. 9కోట్ల క్రీడా ప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఏపీలోని క్రీడాకారులకు తీపికబురు చెప్పిందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రూ. 4కోట్ల 9లక్షల 2వేలు బకాయిలను విడుదల చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. దీనివల్ల ఏపీలో 43మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి చేకూరిందని, తద్వారా వారు క్రీడల్లో మరింత రాణిచ్చేందుకు ఈ ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయని వివరించారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులందరూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి క్రీడాకారుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**లబ్ధి పొందిన క్రీడాకారులు..** కిదాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, ధీరజ్ బొమ్మదేవర, షేక్ జాఫ్రిన్, షేక్ సాథియా ఆల్మస్, ఎ. అజయ్ కుమార్ రెడ్డి, డి. గ్రీష్మ, ఎం. సాహితి వర్షిని, ఏ శివనాగిరెడ్డి, రాయుడు అరుణ్ కుమార్, ఎ. సాయిసంహిత, కె. మోహన్ కిరణ్ కుమార్, కె. నారాయణ, కె. సంధ్య, ఎమ్. సత్యవతి, వి. రావణి, డి. వెంకటేశ్వర్, రియాజ్ సాబూ, గంపా ఆదిత్య వరుణ్, వి. మౌనిక, నాగ జ్ఞానదివ్య, మొదలగు వారు ఉన్నారు.

# శ్రీ అంకమ్మ తల్లి దేవాలయం అనివేటి మండప నిర్మాణానికి మంచి రాజు వారి విరాళం రూ 50000/-



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు గ్రామ దేవత ఆదిపరాశక్తి శ్రీశ్రీశ్రీ అంకమ్మ తల్లి అమ్మవారి అనివేటి మండపం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అనివేటి మండప నిర్మాణానికి భక్తులు తమ వంతు విరాళాలను అందజేస్తున్నారు. గురువారం కందుకూరు పట్టణంలోని మంచిరాజు వెంకట మురళీమోహన్ ధర్మపత్ని అపర్ణ గార్ల పెద్ద కుమారుడు వంశీ కృష్ణ, ధర్మపత్ని హనుమత్ ప్రశాంతి, కుమార్తెలు దీత్య ఆర్యాహి, ధృతి ఐనితి రూ 50000/-లు అమ్మవారికి కానుకగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు వారికి వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.



శ్రీ బాల గణపతి శాంతినగర్ ఎమ్మార్వో ఆఫీస్ వద్ద శ్రీ రాధాకృష్ణ డిజిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు.

-తిరువూరు,కలంకౌంటర్ :

# సామాన్యుడు నుంచి ఒక సంస్థకు చైర్మన్ గా నియామకం

● ముఖ్యమంత్రి ఆశయాల మేరకు శక్తి వంచన మేరకు పనిచేస్తా ● గత 5 సంవత్సరాలు ప్రజల కోసం అనేక పోరాటాలు చేసా ● వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ), ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్







**విజయవాడ, కలంకౌంటర్ :** సామాన్యుడుగా ఉన్న నన్ను ముఖ్య మంత్రి ఎన్నో పదవులు ఇచ్చి ప్రోత్సహించారని ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) గురువారం తాడేపల్లిలోని శ్రీనివాస కన్వెన్షన్ లో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా నన్నునియామకం చేయడం సంతోషంగా ఉందని, అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. నా సాయశక్తులా ఆ పదవికి వన్నె తెస్తానన్నారు. కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం నా శక్తి వంచన లేకుండా పనిచేసి వారికి న్యాయం చేస్తానన్నారు. అంతేకాకుండా నాయకుడు పిలుపును అందుకుని పనిచేయడమే లక్ష్యంగా అలవాటు చేసుకున్నానన్నారు. నాకు పదవి రావడంలో నాకు అండగా ఉన్న నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. తాడేపల్లిగూడెం కు చెందిన ప్రతి ఒక్కరూ నా వెంటే నిలవటం నేను ఎప్పటికీ మరువలేనన్నారు. నాకోసం తాడేపల్లిగూడెం నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. గత 5 సంవత్సరాలు తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. నేను చేసిన అన్ని పోరాటాల్లో నియోజకవర్గానికి చెందిన ప్రజలు నావెంటే నిలిచి నాతో కలిసి వచ్చారన్నారు.. ముందుగా స్టేజీ పై ఉన్న స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి నాయకులు పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు ఉదయం 11 గంటలకు చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేశారు... విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాల్లో ఎన్నో పోరాటాలు చేసిన వ్యక్తి వల వల మల్లిఖార్జునరావు అన్నారు. కూటమి పొత్తులో భాగంగా మల్లిఖార్జునరావు కు ఎమ్మెల్యే టికెట్ రాలేదని, దాని పర్యవసానంగానే ఇప్పుడు చైర్మన్ పదవి వచ్చిందన్నారు. కూటమి సభ్యుల్లో ఏమైనా సమస్యలు ఉంటే అందరూ కూర్చుని మాట్లాడుకుని పరష్కరించుకోవాలన్నారు. నా దృష్టికి వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానన్నారు. ఆంధ్రప్రదేశ్ భవన మరియు నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ గా వలవల మల్లిఖార్జునరావు ఇంకా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటారని ఆశిస్తున్నానన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కార్మిక శాఖలో 3 బోర్డులు ఉంటాయన్నారు. కార్మిక సమస్యలు మీద ఆ బోర్డుకు ఉన్న ప్రాముఖ్యత పై ఆలోచించి వలవల మల్లిఖార్జునరావుకు చైర్మన్ పదవిని అందించారన్నారు. గత ప్రభుత్వంలో ఈ బోర్డును విచ్ఛిన్నం చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సరైన సంస్థకు చైర్మన్ గా మల్లిఖార్జునరావును నియమించారన్నారు. గత 5 సంవత్సరాలు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు ఎన్నో పోరాటాలు చేశారన్నారు. నియోజకవర్గంలో అన్న క్యాంటీన్లను రద్దు చేసినా ఈయన ఎంతో మంది సహకారంతో నిర్వహించారన్నారు. మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఒక మంచి నాయకుడుకి ఒక మంచి పదవి ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు అందించటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ఆ పిలుపును అందుకుని మల్లిఖార్జునరావు పనిచేశారన్నారు. మాజీ మంత్రి, శాసనసభ్యులు పితాని సత్యన్నారాయణ మాట్లాడుతూ కార్మికులకు సమస్యలు మీద పోరాటం చేయడంలో ఆయనకు ఆయనే చాటి అని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు, బడేటి రాధ (చంటి), ఆప్కో చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎపి టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, తదితర నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు కూడా మెరుగైన విద్యను అందిస్తున్నాం...

-విభిన్న ప్రతిభావంతుల మెడికల్ క్యాంపు లో ఎమ్మెల్యే ఇంటూరి...




**కందుకూరు, కలంకౌంటర్ :** విభిన్న ప్రతిభావంతుల కు కూడా మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు.. కందుకూరు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం ఉదయం ప్రభుత్వం వారు కందుకూరు నియోజకవర్గం లోని విభిన్న ప్రతిభావంతుల కొరకు మెడికల్ క్యాంపు నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన కందుకూరు నియోజకవర్గంలో కందుకూరు, గుడ్లూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం, ఉలవపాడు మండల కేంద్రంలలో విభిన్న ప్రతిభావంతుల విద్య అభివృద్ధికి భవితా సెంటర్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు... విభిన్న ప్రతిభావంతుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీసి వారిని ఆదుకొని సమాజంలో వారంతట వారు బతుకుతెరువు పొందే విధంగా ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందించడం జరుగుతుందని తెలిపారు.. గత ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులకు 3000 రూపాయలు పెన్షన్ అందించేవారని కానీ కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వారి పెన్షన్ 6000 రూపాయలకు పెంచిందని తెలిపారు.. యువ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరూ చదువుకొని విద్యావంతులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా విద్యాశాఖ పనిచేస్తుందని తెలిపారు... మన కందుకూరు నియోజకవర్గం లో మొత్తం 373 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని వారికి ప్రతి వారం ఫిజియోథెరపీ డాక్టర్ గారిచే పరీక్షలు చేయిస్తూ నిరంతరం వారికి ఐ ఈ ఆర్ టి టీచర్ల ద్వారా విద్యాబోధనను అందించడం జరుగుతుందని తెలిపారు.. విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల కొరకు ప్రభుత్వం డాక్టర్స్ ని పంపించి మన నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రభుత్వం పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన అలింకో కంపెనీ వారికి అవసరమైన సిపి చైర్స్, వీల్ చైర్స్, హియరింగ్ హెడ్స్, బ్రెయిలీ కిట్, ట్రై సైకిల్స్ ను అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.. ఈ కార్యక్రమంలో కందుకూరు మండల ఎంఈఓ ఎం ఎస్ కే శర్మ, కె సుబ్బారెడ్డి, నెల్లూరు జిల్లా సీఎమ్ఓ పెంచలయ్య, కోఆర్డినేటర్ ప్రసాదరావు, ఎమ్మార్వో లావణ్య ఎంపీడీవో రత్నజ్యోతి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు ఇతర నాయకులు పాల్గొన్నారు

# రూ.28,116 కు గణపతి లడ్డు లడ్డు దక్కించుకున్న ఎడిటర్ రాధాకృష్ణ



**పొదిలి,కలంకౌంటర్ :** వినాయక చవితి సందర్భంగా పొదిలి ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తొలి రోజు పూజ కార్యక్రమాల అనంతరం బుధవారం రాత్రి లడ్డు వేలం పాట ఘనంగా నిర్వహించారు. ఈ వేలం పాటలో వాసవి అమ్మవారి, గణనాధుడి వద్ద ప్రత్యేక పూజలు అందుకున్న గణేష్ లడ్డును ఎడిటర్, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు ఓబులశెట్టి రాధాకృష్ణ, మోహన సుందరి దంపతులు రూ. 28,116 కి దక్కించుకున్నారు. వేలంపాట అనంతరం స్వామి వారి లడ్డును పొదిలి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గునుపూడి చెంచు సుబ్బారావు (జిసి), జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు గునుపూడి భాస్కర్ చేతుల మీదుగా లడ్డూను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రాధాకృష్ణ కుటుంబానికి లడ్డు దక్కించుకున్నందుకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వాసవి అమ్మవారు, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు మెండుగా ఉండడంతో వేలంలో తమ కుటుంబానికి లడ్డు దక్కిందన్నారు. వాసవి అమ్మవారు, విఘ్నేశ్వరుడి ఆశీస్సులు తమ కుటుంబానికి ఎళ్ళవేళలా ఉండాలని వారిని కోరుకున్నట్లు తెలిపారు. చివరగా లాటరీ ద్వారా ఎంపికైన వారికి చీరలు, ఇతరత్రా వస్తువులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో శివాలయం ప్రతిపాది ఛైర్మన్ ఒగ్గు వెంకట రామయ్య, పొదిలి ఏఎంసి డైరక్టర్ సోమిశెట్టి శ్రీదేవి, ఆర్యవైశ్య ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆర్యవైశ్య

# డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలి

● మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి ●సెర్ప్ కార్యక్రమాలను సమీక్షించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి




**ఏలూరు,కలంకౌంటర్ :** జిల్లాలో డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళల సాధికారత కు కృషి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వార్షిక రుణ ప్రణాళిక మరియు డ్వాక్రా సంఘాల జీవనోపాదుల కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని , మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అనువైన వాతావరణం ఉన్నదని , ముఖ్యంగా ఉద్యానవనాలు, మత్స్య శాఖల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటులో డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. జిల్లాలోని 41 వేల 525 స్వయం సహాయక సంఘాలకు గాను 39 వేల 396 సంఘాలు 1688 కోట్ల రూపాయలతో సూక్ష్మ రుణ ప్రణాళికలు అందించారని, వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, వారు దరఖాస్తు చేసిన స్వయం ఉపాధి యూనిట్లు వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనాలు విభాగంలో ప్రకృతి వ్యవసాయంలో మహిళా రైతులను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి వారికి సాంకేతిక రంగాలలో శిక్షణ అందించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా అన్ని విధాలా సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో డ్వాక్రా సంఘాల మహిళలతో ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్ ఏర్పాటుచేసి, పాడి పశువుల కొనుగోలు, గొర్రెలు, మేకలు కొనుగోలుకు, ఆక్వా రంగంలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు ఆన్లైన్ మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలని, రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీతో లబ్ధిదారులకు శిక్షణ అందించి డ్రోన్లు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు, వ్యవసాయాధికారి హబీబ్ భాష, జిల్లా ఉద్యానవన శాఖాధికారి రామ్మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పశు సంవర్ధక శాఖాధికారి డా. గోవిందరాజులు, నాబార్డ్ ఏ జీఎం అనిల్ కాంత్, ఎల్డిఎమ్ నీలాద్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి - జిల్లా ఎస్పీ వకుల్ జిందల్





**విజయనగరం,కలంకౌంటర్ :** విజయనగరం జిల్లాలోని గరివిడి పోలీసు స్టేషన్ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆకస్మికంగా సందర్శించి, స్టేషను ప్రాంగణంను పరిశీలించి, పోలీసు స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ను తనిఖీ చేసి, స్టేషను ప్రాంగణంలో పార్కింగు చేసి ఉన్న వాహనాలు గురించి ఎస్ఐని అడిగి తెలుసుకొని, వాటిని త్వరితగతిన సంబంధిత వ్యక్తులకు అప్పగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద రహదారి ప్రమాదాల నియంత్రణకు స్టాపర్లు, లైటింగు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని ఎస్ఐని ఆదేశించారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషను పరిధిలో సాధ్యమైనన్ని ఎక్కువ సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సందర్శనలు తరుచూ చేయాలని, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను గుర్తించి, వాటిని నియంత్రించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు ఎక్కడా జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని, పేకాటలు, కోడి పందాలను నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. అనంతరం, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గరివిడి పోలీసు స్టేషను పరిసరాలను పరిశీలించి, పార్కింగు చేసివున్న వాహనాలను పరిశీలించి, వాటిని ఏ కేసులో సీజ్ చేసారన్న విషయాలను అడిగి తెలుసుకొని, చట్ట ప్రకారం చర్యలు చేపట్టి, వాటిని రిలీజ్ చేయాలన్నారు. రిసెప్షను రిజిస్టరును పరిశీలించి, ఫిర్యాదులను ఏవిధంగా రిజిస్టరులో నమోదు చేస్తున్నది, డిస్పోజ్ చేస్తున్నది పరిశీలించారు. స్టేషను రికార్డులు, సిడి ఫైల్స్ను జిల్లా ఎస్పీ తనిఖీ చేసారు. దర్యాప్తులో ఉన్న కేసుల సిడి ఫైల్స్ను పరిశీలించి, దర్యాప్తు జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకొని, దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, చీపురుపల్లి సిఐ జి.శంకరరావు, గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు, చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదరరావు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నగరంలో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించండి - కమిషనర్ ఎన్.మౌర్య




**తిరుపతి,కలంకౌంటర్:** నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలో గోవిందరాజ స్వామి మాడా వీధులు, రైల్వే స్టేషన్, పిజిఅర్ థియేటర్ రోడ్డు, పి.కె. లేఔట్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఏర్పడిన తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేర్వేరుగా సేకరించాలని అన్నారు. మాడా వీధుల్లో దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన చెత్త బుట్టలను పరిశీలించి అన్ని దుకాణాల వద్ద ఏర్పాటు చేయించాలని అన్నారు. వినాయక చవితి సందర్భంగా అక్కడక్కడ కాలువల్లో చెత్త వేస్తున్నారని నిర్వాహకులకు అవగాహన కల్పించి పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చేలా చేయాలని అన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, తదితరులు ఉన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ ఎన్.మౌర్య




**తిరుపతి,కలంకౌంటర్ :** నగరంలోని వినాయక సాగర్ లో వినాయక నిమజ్జన ఏర్పాట్లను బుధవారం రాత్రి కమిషనర్ ఎన్. మౌర్య పరిశీలించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు సిబ్బందికి వివరించారు. విగ్రహాలను తీసుకు వచ్చే పోలీసులు సూచించిన మార్గంలోనే వెళ్లి నిమజ్జనం చేయాలని అన్నారు. నిమజ్జన సమయంలో జాగ్రత్త వహించాలని అన్నారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అన్నారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తెప్పలపైకి ఎక్కువ మందిని వెళ్లకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. ఆదివారం ఎక్కువ విగ్రహాలు వస్తాయని అన్ని శాఖల అధికారులు, నిమజ్జన కమిటీ ప్రతినిధులు సమన్వయం చేసుకుని జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ ఆర్.సి. మునికృష్ణ, బోర్డు మెంబర్ భానుప్రకాష్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డీఎస్పీ భక్తవత్సలం, నిమజ్జన కమిటీ చైర్మన్ సామంచి శ్రీనివాస్, గుండాల గోపి తదితరులు ఉన్నారు.

# విశాఖ పార్టీ కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తలను కలుసుకున్న మంత్రి లోకేష్

### -అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ





**విశాఖపట్నం,కలంకౌంటర్ :** పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విశాఖ చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్.. గురువారం సాయంత్రం విశాఖ పార్టీ కార్యాలయానికి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలను కలుసుకున్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి.. వివిధ సమస్యలపై వారి నుంచి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ప్రతి విజ్ఞప్తిని పరిశీలించారు. ఆయా సమస్యల త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి ఫోటోలు దిగారు.



# అమరావతి పై దుష్ప్రచారం తగదు : సదస్సులో నిపుణుల అభిప్రాయం






**విజయవాడ ,కలంకౌంటర్ :** అమరావతిపై జరుగుతున్న తప్పుడు ప్రచారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. గురువారం విజయవాడలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో "అమరావతిపై అబద్ధపు ప్రచారం %-% భావప్రకటన స్వేచ్ఛ" అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టీ. సునీల్ చౌదరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వేచ్ఛతో పాటు దానికి సంబంధించిన బాధ్యతలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అబద్ధపు వార్తల ద్వారా సమాజంలో విద్వేషాలు రాకూడదని, పత్రికా రంగంలో విలువలను నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ముట్నూరి కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు, సి. రాఘవాచారి, ఎబికె ప్రసాద్ వంటి ప్రముఖులు పాటించిన విలువలు నేటి జర్నలిజంలో మరిచిపోతున్నాయన్న ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన సి. ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ – రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కి రాజధాని అవసరం ఏర్పడిందని, అప్పుడు అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. అయితే 2019 తర్వాత అమరావతిపై దుష్ప్రచారం మొదలైందని, వర్షాలతో మునిగిపోయిందనే తప్పుడు ప్రచారం కూడా ఇప్పుడు కొనసాగుతోందని విమర్శించారు. "భావప్రకటన స్వేచ్ఛ" పేరుతో అబద్ధపు ప్రచారం చేయడం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమని స్పష్టం చేశారు. నీటిపారుదల నిపుణుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాలు, వరదలు సహజసిద్ధమని, కేరళ, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఇలాంటి సమస్యలు వస్తాయని అన్నారు. అమరావతి ప్రాంతంలో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి ఆనకట్టలు, ప్రాజెక్టులు నిర్మించడం అవసరమని సూచించారు. ప్రముఖ చరిత్రకారుడు పాపినేని సాయి మాట్లాడుతూ అమరావతికి వేల ఏళ్ల చారిత్రక ప్రాధాన్యం ఉందని, బౌద్ధ జైన సాంస్కృతిక వారసత్వాన్ని కలిగిన ఈ ప్రాంతం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజధానిగా అభివృద్ధి చెందాలని అన్నారు. అమరావతి రైతు నాయకుడు జొన్నలగడ్డ కిరణ్ మాట్లాడుతూ %-% అమరావతి కేవలం రైతుల రాజధాని కాదని, యావత్తు ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలన్నిటినీ తట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ

# అర్హతున్న ప్రతి ఒక్కరికీ ఫించన్ అందాలి-అర్హత ఉండి ఫెన్షన్ రాలేదంటే కలక్టర్లదే బాధ్యత:సిఎస్



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఫించన్ అందించాలని ఎక్కడైనా అర్హత ఉండి ఫించన్ రాలేదని ఫిర్యాదు వస్తే అందుకు సంబంధిత జిల్లా కలక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ స్పష్టం చేశారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భుగర్భ జలాలు,పియం కుసుమ్ పధకానికి భూ సంబంధిత అంశాలు,పింఛన్లు,జిల్లా జువెనైల్ జస్టీస్ కమిటీల ఏర్పాటు వాటి అమలు,ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సంబంధిత అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ముందుగా పింఛన్లు పంపిణీపై సిఎస్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా పెన్షన్ అందేలా చూడాలని కలెక్టర్లుకు స్పష్టం చేశారు. ప్రతినెల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు,జిల్లా,మండల ప్రత్యేక అధికారులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అర్హత గలవారందరికీ తప్పనిసరిగా ఫించన్ అందేలా చూడలాని అర్హత ఉన్నా ఫించన్ రాలేదని మీడియా,సోషల్ మీడియా లేదా మరే ఇతర మార్గాల్లోనైనా ఫిర్యాదులు వస్తే అందుకు ఆయా జిల్లా కలక్టర్లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఎస్ విజయానంద్ పునరుద్ఘాటించారు. పెన్షన్ల తనిఖీకి సంబంధించి లక్షా 35 వేల మందికి నోటీసులు జారీ చేసి నెలరోజుల్లోగా ఎంపిడిఓలకు అప్పీళ్ చేసుకోవాలని తెలియజేయాగా వారిలో 88వేల 319 మంది ఎంపిడిఓలకు అప్పీలు చేసుకోగా ఇంకా 23వేల మంది అప్పీలు చేసుకోలేదని నెలరోజుల గడువులోపు అప్పీళ్ళన్నీ పరిష్కరించాలని కలక్టర్లను సిఎస్ ఆదేశించారు. పెన్షన్ల పంపిణీపై ఎక్కడా నెగిటివ్ ప్రసారం రాకుండా చూసుకోవాలని అర్హతగల వారందరికీ తప్పనిసరిగా ఫెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతకు ముందు మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భూగర్భ జలాల పెంపు,పియం కుసుమ్ ఫధకానికి సంబంధించి భూసంబంధిత అంశాలు,జిల్లా జువనైల్ జస్టీస్ కమిటీలు ఏర్పాటు,యూరియా లభ్యత తదితర అంశాలపై కలక్టర్లతో సిఎస్ సమీక్షించారు. ఈసమావేశంలో సిసిఎల్ఏ జి. జయలక్మి,ఆర్టీజిఎస్ సిఇఓ ప్రఖర్ జైన్,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు,నెడ్ క్యాప్ ఎండి కమలాకర్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, సెర్ప్ సిఇఓ కురుణ,మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి,వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్ గా పాల్గొన్నారు.

# జిల్లాలో వరదలను సమర్ధవంతంగా యంత్రాంగం ఎదుర్కోవాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జిల్లాలో వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టి చాలా అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లాలోని వరద పరిస్థితులపై మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రస్తుతం కృష్ణా నదిలో వరద ఉధృతి అధికంగా ఉందన్నారు. మధ్యాహ్నం 12:20 గంటలకు ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణా నదిలోకి 3.97 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండడంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారన్నారు. ప్రస్తుతం 4.05 లక్షల క్యూసెక్కులకు వరద ప్రవాహం చేరుకుందన్నారు. జిల్లా యంత్రాంగం అంతా వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని, సంబంధిత మండలాల అధికారులందరినీ అప్రమత్తం చేశామన్నారు. తొట్లవల్లేరు మండలంలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఒక ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాన్ని పంపించవలసినదిగా కోరామన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం కలెక్టరేట్లో ఒక కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేశామని ఎవరైనా సరే సహాయక చర్యలకు కోసం 08672 252572 అనే నంబర్కు ఫోన్ చేయవచ్చన్నారు. బుడమేరు పరిధిలో కూడా కొంత వర్షపాతం నమోదు కావడంతో గత ఏడాది వచ్చిన బుడమేరు వరదల తాకిడికి గురైన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ఆ ప్రాంత గ్రామస్తులను అప్రమత్తం చేశామన్నారు. సురక్షిత ప్రాంతాల్లో వరద సహాయక పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేయించామని, వరద ఉధృతి మరింత పెరిగితే లంక గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారిని తరలించి ఎక్కడ ఉంచాలో ఆర్డీవోలకు సూచించామన్నారు. వరదల వలన ఇప్పటివరకు పంట నష్టం ఏమీ లేదన్నారు. లంక గ్రామాల్లో ముఖ్యంగా ఎడ్లంకలో వరద ప్రవాహం తీవ్రంగా ఉందన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది

### -రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో టిడ్కో గృహాలు, చుట్టుపక్కల విద్యుత్ వినియోగదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మంత్రివర్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి మచిలీపట్నం మండలంలోని రుద్రవరం ఏపీ టిడ్కో గృహ సముదాయం వద్ద 7.5 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/ 11 కేవీ అవుట్ డోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ను, చిన్నాపురం సబ్‌స్టేషన్ నుండి కోన సబ్ స్టేషన్ వరకు కోడూరు సబ్‌స్టేషన్ కొరకు 3.75 కోట్లు రూపాయల వ్యయంతో నిర్మించిన 33 కెవి ఇంటర్ లింకింగ్ లైన్స్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా టిడ్కో రుద్రవరం, రుద్రవరం, శారద నగర్, గుండు పాలెం, ఆర్. గొల్లపాలెం, కృష్ణారావుపేట ప్రదేశాలకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. విద్యుత్తు సమస్య లేకుండా ఈ విద్యుత్ సబ్‌స్టేషన్కు బందరు, చల్లపల్లి 2 ఫీడర్ల నుండి కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో రుద్రవరం టి డ్కో గృహాలకు విద్యుత్ సౌకర్యంతో పాటు మిగిలిన ప్రాంతాల్లో లో వోల్టేజ్ సమస్య తీరిందన్నారు. మచిలీపట్నం నగరంలో వోల్టేజ్ సమస్యను తీర్చడానికి మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయుటకు ప్రతిపాదించామని, అందులో విద్యుత్ శాఖ కార్యాలయం కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పిఎం సూర్యాఘర్ పథకం కింద షెడ్యూల్డ్ కులాల తెగలు వారికి ఉచితంగా రెండు కె.వి విద్యుత్తు సోలార్ ఫలకాలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం 98 వేల రూపాయల రాయితీ కల్పించిందన్నారు . బీసీలకు కూడా రాయితీ కల్పించిం దన్నారు మచిలీపట్నం నియోజకవర్గంలో 10 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అవకాశం కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూర్య ఘర్ ఏర్పాటు చేసుకుంటే ఐదు సంవత్సరాల తర్వాత విద్యుత్ బిల్లు చెల్లించవలసిన అవసరం ఉండదని, ఎవరు ఎంత విద్యుత్తు వాడుకోవాలో అంత వాడుకోవచ్చని, వాడుకోగా మిగిలిన విద్యుత్తు ప్రభుత్వ గ్రిడ్ తీసుకొని అందుకయ్యేమొత్తాన్ని సంబంధిత వినియోగదారులకు చెల్లిస్తుందన్నారు. ఆక్వా రైతులకు కూడా కేవలం ఒకటిన్నర రూపాయలకే యూనిట్ విద్యుత్తును ప్రభుత్వం అందిస్తోందని తద్వారా వెయ్యి కోట్ల రూపాయలు ప్రభుత్వం భరిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్ బిల్లు దోచేస్తున్నారని కొందరు ఆరోపణలు చేస్తున్నారని నిజానికి రైతులందరికీ విద్యుత్ మీటర్లు పెట్టడం లేదని కేవలం వాణిజ్యపరంగా పెట్టుకునే కనెక్షన్లకు మాత్రమే తద్వారా వారు ఎంత విద్యుత్తు వాడుకున్నారు తెలుసుకునవచ్చన్నారు డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16,400 మంది యువతకు ఉద్యోగాలు ఇస్తున్నామని చాలామంది పేద కుటుంబాల వారు ముఖ్యంగా ఒకే కుటుంబంలో నలుగురు కూడా ఎంపికయ్యారని ఉపాధ్యాయ ఖాళీలు పారదర్శకంగా భర్తీ చేస్తున్నామన్నారు. మచిలీపట్నం మండలంలోని చిన్నాపురం కే పి టి పాలెం వారధి నిర్మాణానికి 50 కోట్ల రూపాయల వ్యయంతో త్వరలో పనులు చేపట్టనున్నామన్నారు అలాగే బందరు వాసులకు త్వరలో ఇళ్ల స్థలాలు కూడా కేటాయిస్తామని వెల్లడించారు.

రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ టిడికో ఇళ్లకునాణ్యమైన విద్యుత్తు అందించాలని దృఢ సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు కేటాయించిన ఘనత మంత్రికే దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో సిపిడిసిఎల్ ఎస్.ఈ. సత్యానందం మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే దుర్గాప్రసాద్ నాని, కార్పొరేటర్లు రాము, సమతా కీర్తి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.







Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com